


రేపు మంత్రి నారా లోకేష్ తిరుపతికి రాక

ప్రజాశక్తి - క్యాంపస్

ఈనెల 19వ తేదీన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖమంత్రి నారా లోకేష్ తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలో కేంద్ర ప్రభుత్వం, మహిళా యూనివర్సిటీ, శాప్ నిధులతో నిర్మించిన 'ఖేలో ఇండియా మల్టీపర్పస్ ఇండోర్'స్టేడియాన్ని ప్రారంభించనున్నట్లు శాప్ ఛైర్మన్ రవినాయుడు తెలిపారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వి.ఉమ, రిజిస్ట్రార్ ఎన్.రజనీ, సీఎం ప్రోగ్రామ్స్ కోఆర్డినేటర్ రవి, పీఈడీ ఎస్.సరోజినీ, డీస్డీడీఓ సయ్యద్ సాహెబ్ లతో కలిసి వైస్ ఛాన్సలర్ ఛాంబర్లో ఏర్పాట్ల నిర్వహణపై సమీక్షించారు.


ఐటిసిఎక్స్ కార్యక్రమంలో సిఎం చంద్రబాబునాయుడు

టెంపుల్ కన్వెన్షన్‌తో సనాతన ధర్మ పరిరక్షణ

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

టెంపుల్ కన్వెన్షన్‌తో సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తామని వక్తలు ఉద్ఘాటించారు. దేవాలయాల అభివృద్ధి కోసం ప్రజల నుండి ఐవిఆర్ఎస్ కాల్స్ ద్వారా అభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. తదనుగుణంగా మంచి సలహాలతో ఆలయాల నిర్వహణ మరింత పకడ్బందీగా నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించడానికి కార్యచరణ సిద్ధం చేస్తున్నామన్నారు. ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్‌పో -2025ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సోమవారం సాయంత్రం కరకంబాడి మార్గంలోని ఆశా కన్వెన్షన్ సెంటర్‌లో జ్యోతి ప్రజ్వలనం చేసి ప్రారంభించారు. ఈ ఎక్స్ పో ప్రారంభోత్సవానికి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్, గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ సనాతన భారతదేశంలో ఆలయాల నిర్వహణపై ఇంత పెద్ద స్థాయిలో చర్చ జరగడం శుభపరిణామం అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సనాతన ధర్మాన్ని వ్యాప్తి చేయడం కోసం, ధార్మిక కార్యక్రమాలను అమలు చేయడం కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ మాట్లాడుతూ హిందూ సంస్కృతి సాంప్రదాయాలను కాపాడడానికి స్వాతంత్ర్యానికి మునుపే చత్రపతి శివాజీ మహారాజ్ వీరోచిత పోరాటాలను చేశారన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ టెంపుల్ కన్వెన్షన్ ద్వారా ఆధ్యాత్మికతను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి విస్తత మార్గాలు ఏర్పడతాయన్నారు. సనాతన ధర్మంలో భాగంగా ఆలయాల పునర్జీవనం ఆవశ్యకతను ఆనాడే చత్రపతి శివాజీ మహారాజ్ పాటించారన్నారు. పాశ్చాత్య సాంప్రదాయాలను వీడి సనాతన సాంప్రదాయాలను యువత పాటించాలని, ఇందుకు ధార్మిక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఓ మంచి మార్గం అన్నారు.

'ఐటిసిఎక్స్ -2025'లో సిఎంలు

ఆధ్యాత్మిక గురువు ఆచార్య స్వామి గోవింద దేవ్ గిర్జి మహారాజ్ మాట్లాడుతూ ఆలయాల నిర్వహణకు టెక్నాలజీ వినియోగం అందుబాటులో ఉన్న నేపథ్యంలో సనాతన ధర్మ పరిరక్షణ, భారత సంస్కృతి సాంప్రదాయాలను భావితరాలకు అందించడానికి చక్కటి వేదిక ఈ మహా కుంబ్ అన్నారు. ఆర్ఎస్ఎస్ జాయింట్ జనరల్ సెక్రటరీ సి ఆర్ ముకుంద మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓ ఆలయం ఉండాలని, ఆలయ నిర్వహణకు ఓ భవనం ఏర్పాటు చేసుకొని తద్వారా ఆ ప్రాంతంలో ధార్మిక కార్యక్రమాలను విస్తరింప చేయాలన్నారు. అంత్యోదయ ప్రతిస్టాన్ సంస్థ వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వికసిత్ భారత్ 2047 లో భాగంగా దేశవ్యాప్తంగా సనాతన ధర్మ పరిరక్షణకై ప్రత్యేక కార్యచరణతో పనిచేస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ టెంపుల్ కన్వెన్షన్ అండ్ ఎక్స్ పో వ్యవస్థాపకులు గిరీష్ వాసుదేవ్ కులకర్ణి, చైర్మన్ ప్రసాద్ లాడ్, కేంద్రమంత్రి పట్నాయక్, మహారాష్ట్ర మంత్రులు సురేష్, విశ్వజిత్, గోవా మంత్రి రోహన్, ఏపీ రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, థామస్, నెలవల విజయశ్రీ, బొజ్జల సుధీర్ రెడ్డి, కలికిరి మురళీమోహన్, గురజాల మోహన్, కురుగొండ్ల రామకష్ణ, కోనేటి ఆదిమూలం, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, టిటిడి బోర్డు సభ్యులు భానుప్రకాశ్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అంతర్జాతీయ దేవాలయాల కార్యక్రమంలో పాల్గొనేందుకు సోమవారం మధ్యాహ్నం రేణిగుంట విమానాశ్రయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకు సాదర స్వాగతం లభించింది.


తిరుపతి ఆర్డీవో కార్యాలయం ఎదుట మాట్లాడుతున్న ధనలక్ష్మి



నాయుడుపేటలో...

కనీస వేతనం రూ.26వేలివ్వాలి

తిరుపతి ధర్నాలో కె.ధనలక్ష్మి డిమాండ్

సమ్మెకాలం ఒప్పందాలు అమలు చేయాలి

కదం తొక్కిన అంగన్‌వాడీలు



వెంకటగిరిలో..

ప్రజాశక్తి - తిరుపతి టౌన్, యంత్రాంగం

కనీస వేతనం రూ.26వేలివ్వాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ అమలు చేయాలని, సమ్మెకాలపు ఒప్పందాలను అమలు చేయాలన్న ప్రధాన డిమాండ్లుగా జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు కదం తొక్కారు. రాష్ట్ర పిలుపులో భాగంగా తిరుపతి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి ముఖ్య అతిథిగా హాజరై రాష్ట్రంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు, మినీ వర్కర్లు అనేక సేవలందిస్తున్నారని అన్నారు. తాజాగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌లోనూ ఐసిడిఎస్‌కు నిధుల కోత పెట్టడం దుర్మార్గమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా 2019 నుంచి అంగన్‌వాడీలకు వేతనాలు పెరగలేదన్నారు. 42 రోజుల పాటు నిర్వహించిన చారిత్రిక సమ్మె నేపథ్యంలో ముగింపు సందర్భంగా 2024, జులైలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారని అన్నారు. అయితే నేటికీ అమలు కాలేదన్నారు. 164 సూపర్‌వైజర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మెనూ ఛార్జీలు పెంచి, ఉచితంగా ప్రభుత్వమే గ్యాస్‌ను సరఫరా చేయాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవులు కనీసం మూడు నెలలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ భేటీబచావో భేటీ పడావో నినాదాలు పేరుకే గాని, ఆచరణలో ఎక్కడా లేదని విమర్శించారు. గుజరాత్ హైకోర్టు అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.జయచంద్ర, ఎన్.మాధవ్‌కృష్ణ, పి.బుజ్జి, పి.రమేష్, తంజావూరు మురళి, అంగన్‌వాడీ ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు టి.నాగరాజమ్మ, ప్రభావతి, రాజేశ్వరి, కల్పన, ఎల్లమ్మ, ప్రమీల, సుశీల, గోమతి, వరలక్ష్మి, గీత పాల్గొన్నారు.

– **నాయుడుపేటలో** ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.శ్యామలమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. సిఐటియు నాయకులు పి.మునిరాజా, శివకవి ముకుంద, యూనియన్ నాయకులు కళావతి, పుష్పలత, దుర్గమ్మ పాల్గొన్నారు.

– **పిచ్చాటూరులో** సిడిపిఒ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సిఐటియు జిల్లా నాయకులు నాగలాపురం నాగరాజు, రాజేశ్వరి, ఇంద్రాణి, సిపిఎం నాయకులు కె.రామచంద్రారెడ్డి, ప్రాజెక్టు నాయకులు కృష్ణవేణి, నాగభూషణమ్మ, విజయ, పూర్ణమ్మ, భారతి, దేవి, ప్రమీల పాల్గొన్నారు.

- **వెంకటగిరిలో** ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ప్రాజెక్టు కార్యదర్శి ఎన్.స్వరూపరాణి, మండల అధ్యక్షులు సుభాషిణి నాయకత్వం వహించారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం ఆపాలన్నారు.

- **గూడూరులో** ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అధ్యక్షురాలు ఎ.ఇందిరమ్మ, కార్యదర్శి బిఎస్ ప్రభావతి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సెక్టార్ లీడర్లు ఎం.మంగమ్మ, ఎస్‌కె ఆసియా బేగం, మణికుమారి, విజయలక్ష్మి, ఎం.ప్రసన్న, పి.భారతమ్మ, సిఐటియు నాయకులు వెంకట రామిరెడ్డి, జోగి శివకుమార్ పాల్గొన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు, సిడిపిఒ మహబూబికి వినతిపత్రం సమర్పించారు.



పుత్తూరులో..

- **పుత్తూరు టౌన్‌లో...** ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రమణ్యం, జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంచయ్య ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు విజయకుమారి, మునికుమారి, రాధ, పద్మజ, లలిత, అన్నపూర్ణ, ప్రమీల, అంబిక, కృష్ణవేణి, నాగమల్లి, జయంతి, అరుణ, గంగులమ్మ పాల్గొన్నారు.

– **చంద్రగిరిలో..** సిడిపిఒ ఆఫీసు వద్ద ధర్నాలోనూ సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, జిల్లా కార్యదర్శి ఎస్ జయచంద్ర పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు ప్రియదర్శిని, నాగభూషణమ్మ, వాణిశ్రీ, అమర, నవనీత, పద్మప్రియ, ఉషా రాణి, మంజులపాల్గొన్నారు.

- **శ్రీకాళహస్తిలో...** ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సిఐటియు ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, యూనియన్ నాయకులు రేవతి, మల్లీశ్వరి, మాధవి, నాగరాజమ్మ, రాజా పాల్గొన్నారు.

- **సత్యవేడులో...** సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. నిర్మల, శాంతి, ఝాన్సీ, కాంతమ్మ, నాగరాజ, వనరాజ పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో నారాయణాద్రి డాక్టర్లు

ఆస్టర్ నారాయణాద్రిలో 500 గుండె శస్త్రచికిత్సలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్‌లో 500 గుండె బైపాస్ శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించినట్లు ప్రముఖ కార్డియోతోరాసిక్ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ పి. త్రిలోక్ తెలిపారు. రేణిగుంట రోడ్డులోని ఆసుపత్రిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఒకటిన్నర సంవత్సరంలో 500 గుండె బైపాస్ సర్జరీలు విజయవంతంగా చేయడం సంతోషంగా ఉందన్నారు. ఎంతో క్లిష్టమైన కేసులు సైతం 99.9 శాతం సక్సెస్‌రేట్‌తో పూర్తి చేశామన్నారు. ఆసుపత్రి ఎండి డాక్టర్ వి. సునంద కుమార్ రెడ్డి మాట్లాడుతూ 18 నెలలకు ముందు ఆస్టర్ నారాయణాద్రి హాస్పిటల్ లో సీటీవీఎస్ సర్జరీ లు ప్రారంభించినప్పుడు మొదటి 50 రోజుల్లో 50 కేసులు విజయవంతం గా చేసామన్నారు. ఈ విజయం సాధించడానికి ఆపరేషన్ తర్వాత కావలసిన ప్రత్యేక కార్డియాక్ ఐసీయూ పోస్ట్ ఆపరేటివ్ కేర్ ఉండటమే అని తెలిపారు. చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ శ్రీధర్ ముని మాట్లాడుతూ ఏడాదిన్నర కాలంలో 500 గుండె బైపాస్ సర్జరీలు విజయవంతం గా పూర్తి చేయడం రాయలసీమలోనే ప్రత్యేకం అన్నారు. డాక్టర్ శ్రీకాంత్, అనస్థీషియాలజిస్ట్ డాక్టర్ ప్రతిమ, డాక్టర్ సుమంత్ రెడ్డి పాల్గొన్నారు.

విలేకరిపై దాడి హేయమైన చర్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్

పార్వతీపురం జిల్లా మక్కువ మండల ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై టీడీపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు దాడి చేయడాన్ని జర్నలిస్టులు ఖండించారు. ఆంధ్ర ప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు తిరుపతి జిల్లా , గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు గూడూరు పాత్రికేయులంతా కలిసి వినతిపత్రం అందించారు. విలేకరిపై దాడికి పాల్పడిన వేణుగోపాల్‌నాయుడును అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శశి ధర్ (ప్రజాశక్తి), రవి కుమార్ (సాక్షి), రాజేంద్ర (వార్త), విజయ్ కుమార్ (విశాలాంధ్ర), నారాయణ (ఆంధ్ర పత్రిక), సుబ్బ రావు(అరుణ ప్రభ), వెంకయ్య (సింధూర దర్శిని) పాల్గొన్నారు. సిఐటియు నాయకులు రమణయ్య , సురేష్, ఎల్.వి.సుబ్బయ్య సంఘీభావం ప్రకటించారు.





వినతిపత్రం ఇస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు

పునరావాస స్థలాలకు రక్షణ కల్పించండి : సిపిఎం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట

శ్రీహరికోట పునరావాస బాధితులకు నెమలిమిట్ట అగ్రహారంలో ఇచ్చిన ఇంటి స్థలాలకు రక్షణ కల్పించాలంటూ సిపిఎం ఆధ్వర్యంలో కాలనీవాసులు ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ తిరుపతి జిల్లా శ్రీహరికోట రాకెట్ కేంద్రం కొరకు విక్రమ్ సారాభాయ్ 1970 లో శ్రీహరికోట నుండి రాకెట్లను నింగిలోకి పంపేందుకు అనువుగా ఉంటుందని శ్రీహరికోటలో నివాసం ఉంటున్న సుమారు 16 కాలనీలను ఖాళీ చేయించి ఉమ్మడి నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి ఒక్కొక్కరికి 10 సెంట్లు నివాస స్థలము, 3 ఎకరాల సాగుభూమి ఇచ్చారన్నారు. దొరవారిసత్రం మండలంలోని నెమిలి మిట్ట అగ్రహారం గ్రామంలో నివాసానికి అనువుగా వుండే సర్వేనెంబర్ 305 లో సుమారుగా 306 ప్లాట్‌లను శ్రీహరికోట లేబర్ కాలనీ నివాసులకు ఇచ్చారు. అయితే ప్లాట్లలో ఇళ్లను నిర్మించుకునేందుకు పునరావాసులు రాగా అక్కరపాక గ్రామస్తులు అడ్డుకున్నారన్నారు. నాటిన రాళ్లను పగలగొట్టి, వాళ్లపై దుర్భాషలాడి గొడవకు దిగారని ఆర్డీవోకు వివరించారు. ఆర్డీవో స్పందిస్తూ త్వరలోనే బాధితులను గుర్తించి న్యాయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రామిక మండల జిల్లా అధ్యక్షురాలు లక్ష్మమ్మ, నాయకులు కె.లక్ష్మయ్య, సుంకర అల్లెయ్య, ఎస్.సాంబశివయ్య, బి.పద్మనాభం, కాలనీవాసులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



'ఉపమాక' ఆలయ అభివృద్ధికి చర్యలు : హోంమంత్రి

ప్రజాశక్తి- తిరుమల

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలో ఉన్న ఉపమాక శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అభివద్ధికి చర్యలు చేపడతామని టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు ఏపీ హోం మంత్రి వంగలపూడి అనితతో అన్నారు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు విచ్చేసిన హోంమంత్రి దర్శనానంతరం టీటీడీ చైర్మన్ ను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి ఉపమాక ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఐదు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అత్యంత ప్రాశస్త్యం గల ఉపమాక ఆలయాన్ని 2017లోనే టీటీడీకి అప్పగించడం జరిగిందని చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఉపమాక ఆలయాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి పూర్వవైభవం తీసుకురావాలని చైర్మన్ కు తెలియజేశారు. ఈ సందర్భంగా సానుకూలంగా స్పందించిన చైర్మన్ ఆలయ అభివృద్ధికి తగు చర్యలు చేపడతామని ఆమెకు తెలిపారు. ఈ సమావేశంలో టీటీడీ ఈవో జె.శ్యామలరావు, టీటీడీ బోర్డు సభ్యులు ఎం.ఎస్.రాజు, సీఈ సత్య నారాయణ పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణాలివ్వండి : డిప్యూటీ కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

అర్హులైన ప్రతి ఒక్కరికీ సబ్సిడీ రుణాలు మంజూరు చేయాలని నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ అమరయ్య బ్యాంకర్లను ఆదేశించారు. వివిధ కార్పొరేషన్లకు సంబంధించిన రుణాల పంపిణీపై సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీసీ కార్పొరేషన్, బ్రాహ్మిన్, ఈ.బీ.సీ, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య, కాపు కార్పొరేషన్ల రుణాల మంజూరుపై చర్చించారు. ఈ కార్యక్రమంలో యల్.డి.యం. విశ్వనాథ రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఆఫీసర్ బాబు రెడ్డి, మెప్మా సూపరింటెండెంట్ సుధాకర్, సి.యం.యం లు యస్.కృష్ణవేణి, యస్.సోమకుమార్ పాల్గొన్నారు.



శివరాత్రి ఆహ్వాన పత్రికల్లో....

మళ్లీ ప్రోటోకాల్ వివాదం

- కానరాని కలెక్టర్, ఈవో ఫోటోలు
- తప్పుదిద్దుకోని ఆలయ వర్గాలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వర ఆలయాధికారులు తీసుకుంటున్న నిర్ణయాలు నిరంతరం వివాదాస్పదమవుతున్నాయి. తెలిసి తీసుకుంటున్నారా..? తెలియకుండా తీసుకుంటున్నారా..! అన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అనాలోచిత నిర్ణయాలకు..చేతులు కాలాక ఆకులు పట్టుకునే నానుడికి ఆలయ అధికారులు పెట్టింది పేరుగా మారారు. ఇప్పటికే పలు వివాదాస్పద నిర్ణయాలు అమలు చేసి తీవ్ర విమర్శలపాలైన ఆలయ అధికారులు తాజాగా మరో తప్పు చేసి పప్పులో కాలేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల్లో జిల్లా పాలనాధికారి డాక్టర్ వెంకటేశ్వర్, ఆలయ పాలనాధికారి బాపిరెడ్డి ఫోటోలు లేకుండానే ముద్రించేశారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి ఫోటో లేకుండానే ఆహ్వాన పత్రికలు ముద్రించి అభాసుపాలయ్యారు. మరణించిన అప్పటి మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి ఫోటోపై ఎంపీ గురుమూర్తి ఫోటోను అతికించి తప్పు దిద్దుకునే ప్రయత్నం చేశారు. అప్పట్లో అది మరింత దుమారం రేపింది. చనిపోయిన వ్యక్తి ఫోటోపై ఎంపీ ఫోటో అతికించడమేంటనీ, గురుమూర్తి దళితుడు కావడంతోటే ఇలా చేశారన్న అపవాదును మూటగట్టుకున్నారు. దాన్ని కవర్ చేసేందుకు ఆలయంలో కీలక పాత్ర పోషించే ఓ ఉద్యోగి ఎంపీ గురుమూర్తి ఫోటోను తన గుండెలపై అతికించుకుని మీడియా ముందు ఫోజులు ఇవ్వడం గమనార్హం. ఇప్పుడు ఏకంగా ఆలయ ఆహ్వాన పత్రికల్లో కలెక్టర్, ఆలయ ఈవో ఫోటోలు లేకుండానే ముద్రించడంపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల డిజైనింగ్ దగ్గర నుంచి ప్రింటింగ్ వరకు ఆలయాధికారులు ఒకటికి పది సార్లు తప్పొప్పులు సరిచూసుకుంటుంటారు. అంతా బాగుందన్న తర్వాతే ప్రింటింగ్ వేయిస్తారు. దానికి లక్షల్లో ఖర్చు చేస్తారు. అయినా తప్పులు దొర్లినప్పుడు సరి చేయాలంటే మళ్లీ అదనపు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఈ భారం భక్తుల సమర్పించే ముక్కంటి హుండీ ఆదాయంపైనే పడుతుంది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికల్లో కలెక్టర్ ఈవో ఫోటోల ప్రోటోకాల్ రగడపై ఆలయ వర్గాలతో పాటు ప్రజల్లో చర్చ నడుస్తుండగా దీనిపై ఇప్పటివరకు ఆలయ ఈవో పెదవి విప్పకపోవడం గమనార్హం. పైగా ఆయన ఉత్సవాలకు ప్రముఖులను ఆహ్వానించే పనుల్లో బిజీగా ఉన్నారు.




భూకబ్జాదారు ఆశీర్వాదం

చర్యలు తీసుకోవాలని అఖిపక్షం డిమాండ్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రైల్వే పోలీసు ఉన్నతాధికారి ఆశీర్వాదం తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని పాకాల మండలం కుక్కలపల్లి దళిత గ్రామంలో నాలుగు ఎకరాల భూమిని అక్రమంగా కొనుగోలు చేశారని, ఆ ప్రాంత దళితుల భూముల్లో దౌర్జన్యంగా రోడ్డును వేయడానికి ప్రయత్నించారని, అడ్డుకున్న వారిపై దాడికి పాల్పడ్డారని, భూకబ్జాదారు ఆశీర్వాదంపై కఠిన చర్యలు తీసుకోవాలని అఖిలపక్షం నేతలు డిమాండ్ చేశారు. రైల్వేలో ఉన్నతస్థాయి అధికారిగా ఉంటున్న ఆశీర్వాదం డీకేటి భూములను కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నించారు. సోమవారం ఉదయం పాకాల మండలం కుక్కలపల్లి దళిత గ్రామాన్ని రిటైర్డ్ జిల్లా జడ్జి గుర్రప్ప నేతత్వంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పి. మురళి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందారపు మురళి, రిపబ్లికన్ పార్టీ దక్షిణ భారత అధ్యక్షులు పి అంజయ్య, బహుజన సమాజ్ పార్టీ నాయకులు గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఆశీర్వాదం తన కుటుంబ సభ్యులు, కొంతమంది రౌడీలతో కలిసి దౌర్జన్యంగా ఇక్కడి దళితులను బెదిరిస్తున్నారని, తమ సొంత ఖర్చుతో దళితులు నిర్మాణం చేసుకున్న కాంపౌండును పగలగొట్టారని ఆరోపించారు. పాకాల మండల పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆశీర్వాదం అక్రమాలను ప్రశ్నించకుండా ప్రేక్షక పాత్ర వహిస్తున్నారన్నారు. ఆశీర్వాదంపై తక్షణం చర్యలు తీసుకోవాలని, ఆయన కొనుగోలు చేసిన భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంపిణీ చేయాలని కోరారు. ఆశీర్వాదంను ఉద్యోగం నుంచి సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



రైతు గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోండి



రెవెన్యూ కార్యాలయంలో మాట్లాడుతున్న డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ భాష

ప్రజాశక్తి - రామచంద్రాపురం: రైతువిశిష్ట గుర్తింపు సంఖ్య కోసం మండలంలోని రైతులందరూ తమ వివరాలు రైతు సేవ కేంద్రా లలో నమోదు చేసుకుని, విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని మండల రెవెన్యూ డిప్యూటీ తహసీల్దార్ అన్వర్ భాష కోరారు. సోమవారం రెవెన్యూ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ శాఖ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుపై గ్రామాలలో అవగాహన కల్పించాలన్నారు. భూ యజమానులు చనిపోయి ఉంటే వారసులు తమ పేరున ఆ భూమిని మ్యుటేషన్ ద్వారా ఆన్లైన్లో మార్చుకోవాలన్నారు. రైతు లు సమీపంలోని... ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ప్రవంతి, ఆర్ఐ లక్ష్మీనారాయణ, సర్వేయర్ రమేష్ బాబు, వీఆర్వో లు రాజశేఖర్, ప్రదీప్ నాయుడు, గుణ భూషణ్ నాయుడు, బాబు, రూప్లీ, నరసింహులు, మల్లికార్జున, అగ్రికల్చర్ అసిస్టెంట్లు కార్తీక్, ఢిల్లీ రాణి, సుకన్య తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దాం



సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

ప్రజాశక్తి - కేవిబి పురం: కేవిబి పురం మండలంలో సోమవారం ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటించి పలు అభివృద్ధి కార్యక్ర మాలకు భూమి పూజ చేశారు. ఉదయం 11 గంటలకు మండ లంలోని రాయపేడు గ్రామానికి చేరుకుని బీసీ కాలనీ నుండి స్మశానం వరకు సిసి రోడ్డు నిర్మాణానికి, ఎస్సీ కాలనీకి మంజూరైన సిసి రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకుని అధికారులు, ప్రజాప్రతి నిధులు, టీడీపీ నాయకులతో ఆత్మీయ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విభేదాలు పక్కనబెట్టి అభివృద్ధికి కృషి చేద్దామని, కేవిబి పురం మండలంతో పాటు సత్యవేడు నియోజకవర్గం అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. త్వరలో అర్హులైన ప్రతి కుటుంబానికి 3 సెంట్లు ఇంటి పట్టా ఇవ్వడంతో పాటు, ఇంటి నిర్మాణాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే ఆదిమూలంను ఆహ్వానిస్తున్న ఈవో లత, ప్రధానార్చకులు

ప్రజాశక్తి - పిచ్చాటూరు (తిరుపతి జిల్లా): నాగలాపురం మండలం, సురుటుపల్లి శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయ శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంను సోమవారం ఆలయ ఈఓ లత, ప్రధాన అర్చకులు కార్తికేయ గురుకుల్లు ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ డి.ఇలంగోవన్ రెడ్డి, పద్దు రాజు, రవి, గణేంద్ర, కొల్లపురి రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆక్రమణను అడ్డుకున్న రెవెన్యూ అధికారులు



ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి నగరంలోని సుబ్బారెడ్డి నగర్లో, తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి ఆదేశాల మేర కు ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాన్ని సోమవారం రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. అక్కారంపల్లి గ్రామ లెక్కల దాఖలాల సర్వే నెంబర్ 112/11 లో దాదాపు 25 సెంట్లు ప్రభుత్వ భూమిని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించి నిర్మాణం చేపడు తుండగా విషయం తెలుసుకున్న వీఆర్వో ప్రసాద్, మండల సర్వే యర్ జగదీష్, రెవెన్యూ సిబ్బంది అలిపిరి పోలీసుల సహాయంతో ఆక్రమణను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికా రులు మాట్లాడుతూ ఇక్కడ ఉన్న భూమి ప్రభుత్వ భూమిగా తమ రికార్డుల్లో ఉందని, ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని అలా ఎవరైనా చేపడితే ప్రభుత్వపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుపతిలో భూముల విలువ పెరుగుతుం డటంతో కబ్జా రాయుళ్లు అడ్డు అదుపు లేకుండా ప్రభుత్వ భూమి ఎక్కడ కనపడితే ఆక్రమించుకుంటున్నారని వాటిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సచివాలయ ఉద్యోగుల సమస్యలపై మంత్రికి వినతి



వెలగపూడిలో మంత్రితో జరిగిన సమావేశంలో కోటేశ్వరరావు

ప్రజాశక్తి - ఏర్పేడు: గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణ విషయంగా వెలగపూడి రాష్ట్ర సచివాలయంలో గ్రామ వార్డు సచివాలయం శాఖ మంత్రి డోల వీరాంజనేయ స్వామి ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల సమావేశం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య సంఘం తరుపున ఏర్పేడు మండలానికి చెందిన రాష్ట్ర అధ్యక్షులు తోటకూర కోటేశ్వరరావు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సచివాల ఉద్యోగుల సమస్యలను మంత్రికి వివరించి, పరిష్కరించాలని కోరారు. మంత్రి స్పందిస్తూ సీనియర్ అధికారులతో కమిటీ వేసి సర్వీస్ నిబంధనలు రూపొందిస్తామన్నారు.

వైభవంగా కుంభాభిషేకం



ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: స్థానిక మున్సిపాలిటీ పరిధి, తిమ్మాపురంలోని వెలసి ఉన్న శ్రీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి దేవాలయ మహాకుంభాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నగరి శాసనసభ్యులు గాలి భాను ప్రకాశ్ హాజ రయ్యారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎన్.భరత్, చిత్తూరు పార్ల మెంటరీ బీసీ సెల్ అధ్యక్షులు షణ్ముగం రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ డిఎస్ గణేష్, బాలె రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించండి



తిరుపతి టౌన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే వినతులను వెంటనే పరిష్కరిం చాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి అన్నారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 15 మంది, నేరుగా మరో 27 మంది వచ్చిన వినతులను అందిం చారు. టౌన్ క్లబ్ కు టి.డి.ఆర్ బాండు ఇప్పిం చాలని, వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్క రించాలని, సచివాలయ కార్యదర్శుల బదిలీ లకు అవకాశం కల్పించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి. మునికష్ణ, కార్పొరే టర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, అన్నా అనిత, రేవతి, కల్పన, శైలజలు వినతి పత్రం అందిం చారు. నగరపాలక సంస్థ ఉద్యోగులకు తూకి వాకం వద్ద ఇంటిస్థలాలు ఇవ్వాలని యూని యన్ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీ సర్ డాక్టర్ యువ అన్వేష్ ఉన్నారు. తిరుపతి ఎంపి డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆధ్వర్యం లోనూ ఆయన కార్యాలయంలో వినతులను స్వీకరించారు.

శ్రీకాళహస్తి (తొట్టంబేడు) : ప్రతి రెవెన్యూ సమ స్యకూ ఖచ్చితమైన పరిష్కారం లభిస్తుందని తొట్టంబేడు తహశీల్దార్ మధుసూదన్ రావు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుపతి కమిషనర్‌కు సీఎం అభినందన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్యను ఎక్స్ వేదికగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , మంత్రి నారా లోకేష్‌లు అభినందించారు. నగరంలోని స్కావెంజర్స్ కాలనీలో అపరిశుభ్ర పరిస్థితులను చూసి చలించిపోయిన కమిషనర్ మౌర్య చొరవ తీసుకుని కాలనీని రంగులతో, గోడలపై కథా చిత్రాలు తీర్చిదిద్దారు. అలాగే వారి సమస్యలను తెలుసుకుని పరిష్కార దిశగా అడుగులు వేశారు. ఈ విషయాలను తెలుసుకుని ముఖ్యమంత్రి, మంత్రిలు ఆమెను అభినందించారు.

వేమనపై ఎస్వీయులో సదస్సు

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ యూనివర్సిటీ సెనేట్ హాల్‌లో వర్సిటీ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం వేమన పై సదస్సు జరిగింది. వర్సిటీ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కే.టి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ముఖ్య అతిథులు ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు పాల్గొన్నారు. వారు ప్రసంగిస్తూ వేమన పద్యాల ప్రాధాన్యతను తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సంఘ కార్యదర్శి ఆచార్య సరిత, డా ఆదిశేషు, డా సుదర్శన్, పూర్వ విద్యార్థి సంఘ అధ్యక్షుడు మునిరత్నం రెడ్డి, తెలుగు అధ్యయన శాఖ విద్యార్థులు పాల్గొన్నారు.

యూఎస్ఏ ప్రతినిధి ఫిజిక్స్ విభాగం సందర్శన

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాన్ని అమెరికాకు చెందిన పార్డ్ యూనివర్సిటీ ప్రతినిధి జూలియానా కస్తవన్ సందర్శించారు. విభాగ అధిపతి దేవప్రసాద్ రాజు, ఇతర ఆచార్యులతో ఆమె సమావేశమయ్యారు. గతంలో ఎస్వీ యూనివర్సిటీతో తమ యూనివర్సిటీ ఎంఓయు చేసుకుందనీ, ఈ ప్రకారం టీచింగ్, రీసెర్చ్, ఎక్స్టెన్షన్ విషయాల్లో పరస్పరం సహకరించుకోనున్నట్టు తెలిపారు.

ప్రాథమిక దశలో కేన్సర్ నివారణ సాధ్యం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: ప్రాథమిక దశలో క్యాన్సర్‌ను గుర్తిస్తే పూర్తిగా నివారణ సాధ్యమవుతుందని తొట్టంబేడు వైద్యాధి కారిణి డాక్టర్ లహరిణి తెలిపారు. స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం తొట్టంబేడు పిహెచ్ సి పరిధిలోని ఎంపిడిఓ కార్యాలయం, సాంబయ్యపాళెంలోని సచివాలయంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు.

కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ జేఏసీ చైర్మన్‌గా నాగ వెంకటేష్



ప్రజాశక్తి - క్యాంపస్: ఎపి స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అండ్ టీచర్స్ అండ్ వర్కర్స్ జేఏసీ నూతన కమిటీ ఎన్నికయ్యింది. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర జేఏసి చైర్మన్ ఎవి నాగేశ్వరరావు, శ్రామిక మహిళా రాష్ట్ర కన్వీనర్‌క ఎ.ధనలక్ష్మి, తిరుపతి జిల్లా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి నేతృత్వంలో కమిటీ ఎన్నిక జరిగింది. చైర్మన్‌గా గండికోట నాగ వెంకటేష్, కో చైర్మన్‌గా బాబు, ఎస్.మొయిద్దీన్, పి.వరలక్ష్మి, మునికృష్ణయ్య, గంగయ్య, సెక్రటరీ జనరల్ ఎ.ప్రదీప్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా జి.చిన్నబాబు, ఎస్.జయచంద్ర, కోశాధికారిగా టి.కుమార్ తదితరులతో కమిటీ ఏర్పాటయ్యింది. భవిష్యత్‌లో ఉద్యోగ కార్మికుల హక్కులకై ఈ కమిటీ పోరాడుతుందని తెలిపారు.

నాయుడుపేట సబ్ రిజిస్ట్రార్ మృతి



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడుపేట సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కె.సుమలత గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. నెల్లూరు జిల్లా పొదలకూరులో పని చేస్తున్న ఆమె గత సంవత్సరం బదిలీపై నాయుడుపేటకు వచ్చారు నాలుగు నెలల క్రితం ఆమె అనారోగ్య సమస్యతో వైద్యం కోసం సెలవు పై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆమె ఆరోగ్యం మరింత క్షీణించడంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మతి చెందారు. ఆమె స్వస్థలం గుంటూరు జిల్లా. మృతదేహాన్ని గుంటూరుకు తరలించి అక్కడ ఆమెకు అంత్యక్రియలు నిర్వహించనున్నారని రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది తెలియజేశారు.

ఎపి పిజిసెట్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్ : మంత్రి నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని విద్యార్థిసంఘాలు డిమాండ్ చేశాయి. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి నిర్వహిస్తున్న ఉమ్మడి ఎపి పిజిసెట్‌ను వ్యతిరేకిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పంపాలని ఎస్వీయూ ఇన్‌ఛార్జి విసి అప్పారావుకు వినతిపత్రం అందించారు. బండి చలపతి, అక్బర్, రవి, జైమల్లికార్జున, తిరుమలేష్, శివశంకర్‌నాయక్, భార్గవ్‌సాయి, శ్రీధర్ పాల్గొన్నారు.

మతప్రాతిపదికన నియామకాలు రద్దు చేయాలి



స్విమ్స్ కళాశాలలో రేడియాలాజిస్ట్ మెడికల్ లెక్చరర్ పోస్టులు మత ప్రాతిపదిక నియామకాలను రద్దు చేయాలని, రాజ్యాంగ బద్ధంగా నియామకాలు అర్హులైన వారిని భర్తీ చేయాలనీ విద్యార్థిసంఘాలు డిమాండ్ చేశాయి. లౌకిక విద్యా సంస్థలలో రాజ్యాంగాన్ని కాపాడుకుందాం అంటూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలిపారు.

ముంబాయిలో అమ్మవారి ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించండి

మహారాష్ట్ర సీఎంకు టీటీడీ చైర్మన్ వినతి

ప్రజాశక్తి - తిరుపతి సిటి : నవీ ముంబైలో అమ్మవారి ఆలయం, టీటీడీ సమాచార కేంద్రం నిర్మించేందుకు స్థలం కేటాయించాలని టీటీడీ చైర్మన్ నాయుడు, సీఎం చంద్రబాబు ద్వారా మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు వినతి పత్రం అందజేశారు. సోమవారం తిరుపతిలో కుంభ్ ఆఫ్ టెంపుల్స్ సదస్సుకు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ హాజర య్యారు. ఈ సంర్భంగా ఆయనను ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఇప్పటికే శ్రీవారి ఆలయ నిర్మాణానికి 3.61 ఎకరాల స్థలాన్ని లీజుపై కేటాయించారని, మరో 1.50 ఎకరాల స్థలంలో అమ్మవారి ఆలయాన్ని నిర్మించాలని టీటీడీ నిర్ణయించిం దని, ఈ మేరకు స్థలాన్ని కేటాయించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని టీటీడీ కోరింది.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 238 అర్జీలు



సమస్యలను వివరిస్తున్న షికారీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రజా సమస్య ల పరిష్కార వేదికకు వచ్చే ప్రతి అర్జీకి క్షేత్రస్థాయిలో పరిశీలించి తగిన పరిష్కారం చూపాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేంద్ర రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం తిరుపతి కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 161 అర్జీలు వచ్చాయి.

నక్కల కాలనీలో మౌలిక వసతులను కల్పించండి

ఎన్నో ఏళ్లుగా కలెక్టరేట్ భవనానికి ఆనుకుని ఉన్న నక్కల కాలనీలో మౌలిక వసతులు లేక ఇబ్బందులు పడుతున్నామని నక్కల కాలనీకి చెందిన షికారులు అర్జీలు సమర్పించారు.


గృహ నిర్మాణ శాఖపై ఫిర్యాదు



ఫిర్యాదు చేస్తున్న డి.జయ

ప్రజాశక్తి - నాగలాపురం: నాగలాపురం మండలం, వడ్లకుప్పంలో నివసించే జయ అనే మహిళకు గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణ అనుమతి వచ్చింది. గృహ నిర్మాణ శాఖ అధికారులు కాంట్రాక్టర్ సత్యకు నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. జయ తన ఖాతాలో ప్రభుత్వం వేసిన నగదుతోపాటు, రూ.50 వేలు అదనంగా కాంట్రాక్టర్‌కు చెల్లించింది. ఇప్పటివరకు 7 అడుగుల గోడ నిర్మాణం పూర్తయింది. కానీ ఆ గోడను నాసి రకంగా నిర్మించడంతో పడిపోయింది. ఈ విషయంపై గృహ నిర్మాణ శాఖ అధికారులకు తెలుపగా వారు పరిశీలించి, పూర్తి నిర్మాణం జరిపేందుకు నగదు చెల్లించడం జరిగిందని తెలిపారు. దీంతో ఖంగుతిన్న జయ నాగలాపురం ఇంచార్జ్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిణి వెంకటరత్నమ్మకు ఫిర్యాదు చేసింది. తనకు న్యాయం చేయాలని కోరింది.


హైస్కూల్ ప్లస్‌ను కొనసాగించాలి : ఏపీటీఎఫ్



సమావేశంలో పాల్గొన్న ఏపీటీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : ప్రభుత్వం హై స్కూల్ ప్లస్ కొనసాగించాలని ఏపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 117 ఉపసంహరణ, ఉపాధ్యాయ పోస్టులు పునర్విభజనకు ప్రభుత్వం సన్నతమవుతున్న తరుణంలో, సోమవారంస్కూల్ కాంప్లెక్స్ మీటింగ్‌పై ఏపీటీఎఫ్ 1938వ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవన్లో జరిగిన సమావేశంలో ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు చేశారు. 1) ఫౌండేషన్ పాఠశాల, బేసిక్ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయ విద్యార్థులను 1:20 నిష్పత్తిగా పరిగణించాలి. 2) మోడల్ ప్రాథమిక పాఠశాల స్థాపనకు 45 మంది విద్యార్థులను కనీస నమోదుగా పరిగణించాలి. 3) 45 మందిపైన ప్రతి 20 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని కేటాయించాలి. 4) ప్రాథమికోన్నత పాఠశాల వ్యవస్థను కొనసాగించాలి. 5) 6,7,8 తరగతుల బోధనకు ఆరుగురు స్కూల్ అసిస్టెంట్లు కేటాయించాలి. 6) ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ విద్యార్థి నిష్పత్తిని 1:30గా పరిగణించి తరగతికి 46 మంది విద్యార్థులనుంచి రెండవ సెక్షన్ మంజూరు చేయాలి. 7)ఆపైన ప్రతి 30 మంది విద్యార్థులకు కొత్త సెక్షన్ మంజూరు చేయాలి. 8) ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సంబంధం లేకుండా హెచ్ఎం పోస్టు, పిఈటీ పోస్టులను కేటాయించాలి. 9) హై స్కూల్ ప్లస్‌లను కొనసాగించాలి. 10) మాతృభాష/ ప్రాంతీయ బాషలోనూ, ఇంగ్లీషులోనూ సమాంతర మాధ్యమన్ని కొనసాగించాలి. 11) స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు సబ్జెక్ట్ టీచర్లకు మండల యూనిట్‌గా తీసుకునవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాజేష్, ఎస్. చంగల్రాయమందడి, ఎం.రవీంద్ర, కే.మల్లికార్జున, ఎన్.రమేష్, ఎస్. సురేష్, ఎం.నరేంద్ర, ముని రామిరెడ్డి, దేవానంద్, ఎం.కిరణ్, కుప్పయ్య, గుర్రప్ప, యుగంధర్, గణేష్, రామానుజులు శరవణ, సోమశేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్



అమ్మవారి ఆలయంలో మహారాష్ట్ర సీఎం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : తిరుచానూరు, శ్రీ పద్మావతీ అమ్మవారిని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సోమవారం దర్శించుకున్నారు. ఆలయంలో డిప్యూటీ ఈవో గోవింద రాజన్ ఆయనకు స్వాగతం పలికారు. పద్మావతీ అమ్మవారి దర్శనానంతరం ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలను అందించారు. మహారాష్ట్ర సీఎం వెంట టిటిడి బోర్డు సభ్యులు జి.భాను ప్రకాష్ రెడ్డి, సౌరభ్ హెచ్.బోరాలు ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


స్వచ్ఛ ఆంధ్రలో చిన్నపాలువేడు గ్రామస్తులు తొలి అడుగు



మొక్కలు నాటుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని చిన్నపాలువేడు గ్రామంలో సోమవారం ఉదయం స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్య క్రమంలో చిన్నపాలివేడు గ్రామస్తులు తొలి అడుగు వేశారు. చెట్లు నాటి, పచ్చదనాన్ని పెంపొందించడంలో ముందడుగు వేశారని తాసిల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం తెలియజేశారు. 3 లక్షల రూపాయల వ్యయంతో చెట్లు నాటడంతో పాటు, పాఠశాల ఆవరణను పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్ రమేష్ మాట్లాడుతూ మంచి కార్యక్రమాల అమలులో చిన్నపాలివేడు గ్రామస్తులు ముందుంటారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రత్నమ్మ, ఎంపీడీవో త్రివిక్రమ రావు, ఎమ్మార్వో సుబ్రహ్మణ్యం, ఎంఈఓ రవీంద్రనాథ్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మల్లయ్య, అగ్రికల్చర్ అధికారిణి భారతి, వెంకటేశ్వర్లు, సుబ్బారావు, రాజేంద్ర, సుధాకర్ నాయుడు, శేఖర్ నాయుడు, విజయ్ గోపాల్, మాజీ సర్పంచ్ సుధాకర్, హనుమంతరావు, ప్రభాకర్, నాగరాజు, శివయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.


ఘనంగా స్వచ్ఛత పక్షోత్సవాల ముగింపు



విద్యార్థులకు సర్టిఫికేట్లు ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : స్వచ్ఛత, స్వచ్ఛ భారత్ అభియాన్ ఆదర్శాలను ప్రోత్సహించడానికి పక్షం రోజుల పాటు జరిగిన స్వచ్ఛత పక్షోత్సవాలు సోమవారంతో ముగిశాయి. ఎన్ఏ ఆర్ ఎల్ ఆధ్వర్యంలో ఈ నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన స్వచ్ఛత పక్షోత్సవాలలో పారిశుద్ధ్య కార్యకలాపాలను నిర్వహించారు. ఎన్ఏఆర్ఎల్ క్యాంపస్, గాదంకి, జడ్పీ హైస్కూల్‌లో ఇంటెన్సివ్ క్లీనింగ్ డ్రైవ్‌లు నిర్వహించారు. విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బుల్లితెర, తెలుగు నటుడు బాబీ భాగస్వామ్యంతో స్వచ్ఛత పఖ్వాడ ముగింపు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రవి ప్రసాద్, సహాయ సంచాలకులు శ్రీనివాస గుప్త, కార్యనిర్వహణాధికారి మల్లికా మాధురి, హరి వెంకట కుమార్, కెవి సిజి ఎన్ ఏ ఆర్ ఎల్ ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కనవనంబేడు దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వండి



తిరుపతి కలెక్టరేట్‌లో డిఆర్ఓకు వినతిపత్రం ఇస్తున్న చిన్నిరాజు తదితరులు

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో ఉన్న నేర్పాకోట, కనవనంబేడు రెవెన్యూ భూములను అనర్హులు, స్థానికేతరులు, డబ్బు లున్న పెత్తందారులు ఆక్రమించుకొని అమ్ముకుంటున్నారని, అదే గ్రామాలలో ఇంటి స్థలం లేని నిరుపేదలు ఎంతోమంది ఉన్నారని ఆ భూములను రెవెన్యూ అధికా రులు పరిశీలించి అర్హులైన పేదవారికి పట్టాలు ఇవ్వాలని భారత కమ్యూనిస్టు పార్టీ సత్యవేడు నియోజకవర్గ కమిటీ కార్యదర్శి చిన్ని రాజు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో భాగంగా, తిరుపతి కలెక్టర్‌లో డిఆర్ఓను కలిసి సిపిఐ ఆధ్వర్యంలో దళితులకు సదరు భూమిలో పట్టాలివ్వాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా చిన్ని రాజు మాట్లాడుతూ ఎంతో కాలంగా ప్రభుత్వ భూమిని అన్యాక్రాంతం కాకుండా కాపాడుతున్నామన్నారు. పట్టాలు ఇవ్వకుంటే ఎర్రజెండాలు నాటి మేమే గుడిసెలు వేయిస్తామని అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య, చింతపూడి రమణయ్య, మాధవయ్య, షణ్ముగం, బాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైం న్యూస్


భార్యని ఎందుకు కొడతావని అడిగినందుకు హత్య



హత్యకు గురైన జగదీష్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : కట్టుకున్న భార్యను ఎందుకు కొడుతున్నావ్ అని అడిగినవ్యక్తిని, తాగుబోతు భర్త హత్య చేసిన ఘటన సోమవారం తిరుపతిలో జరిగింది. పోలీసుల కథల మేరకు తిరుపతి చెన్నారెడ్డి కాలనీలో అన్నమయ్య జిల్లా, మొలకల చెరువుకు చెందిన సునీల్ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో నివసిస్తున్నాడు. సునీల్ నిత్యం మద్యం సేవించి వచ్చి భార్యను కొట్టేవాడు. సోమవారం మద్యం సేవించిన సునీల్ తన భార్యను కొడుతుండగా, పక్కన్నే నివాసం ఉంటున్న అంబులెన్స్ క్లీనింగ్ చేసే జగదీష్ (40) ఎందుకు కొడుతున్నావని సునీల్‌ను వారించాడు. దీంతో కోపోద్రిక్తుడైన సునీల్ పక్కనే ఉన్న ఇనుప చువ్వ తీసుకుని, జగదీష్ గుండెలపై పొడిచాడు. తీవ్ర గాయాలపాలైన జగదీష్‌ను స్థానికులు తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని, మృతదేహాన్ని పరిశీలించారు. హత్యకు పాల్పడిన సునీల్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూరి ఇల్లు దగ్ధం.. వీధిన పడ్డ కుటుంబం



అగ్నికి ఆహుతవుతున్న పూరి ఇల్లు

ప్రజాశక్తి - పిచ్చాటూరు : పిచ్చాటూరు బీసీ మహిళా హాస్టల్ పక్కన నివసించే కుప్పయ్యకు చెందిన పూరిల్లు సోమవారం ప్రమాద వశాత్తు పూర్తిగా దగ్ధమైంది. ఇంటిలో ఉన్న గ్యాస్ సిలిండర్ అంటుకోకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పిందని స్థానికులు తెలిపారు. ఇల్లు పూర్తిగా ఆహుతవడంతో కుప్పయ్య కుటుంబం నిలవనీడ లేక వీధిన పడింది. ప్రమాద నష్టాన్ని అధికారులకు తెలియజేసి ఆదుకుంటామని వీఆర్వో ప్రియాంక హామీ ఇచ్చారు.

అంగన్వాడీలో తేలు కాటు

ప్రజాశక్తి - బాలాయపల్లి : మన్నూరు కొత్తూరులో అంగన్వాడీ పాఠశాల అపరిశుభ్రతకు నెలవుగా మారింది. పాఠశాల చుట్టుపక్కల చెత్త చెదారాలు, మురికి కాలువ ఉండటంతో దోమలు, విషకీటకాలకు ఆలవాలమయింది. సోమవారం అంగన్వాడీ టీచర్ రమాదేవి వెంకటగిరిలో మీటింగ్‌కు వెళ్లింది. అక్కడే పనిచేస్తున్న ఆయమ్మ పర్యవేక్షణలో పాఠశాల చిన్నారు, తన కుమార్తె (15)లు ఉన్నారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో చాపలు పరుస్తుండగా, చాపలోంచి తేలు వచ్చి ఆయమ్మ కుమార్తెను కుట్టింది. పిల్లలు ఈ ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. తల్లిదండ్రులు చిన్నారులను తేలు కుట్టిఉంటే వారి పరిస్థితి ఏమిటని వాపోయారు. అంగన్వాడి పాఠశాల పరిశుభ్రంగా లేనందువలనే విషపురుగులు వస్తున్నాయని తెలిపారు. బాతురూములు మరీ అధ్వానంగా ఉన్నాయన్నారు. పరిసరాల్లో మరుగు చేరడంతో ఇలాంటి ప్రమాదాలు జరిగుతున్నాయని తెలిపారు. అధికారుల స్పందించి చిన్నారులకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

సత్యవేడు ఇంచార్జ్ తహశీల్దారుగా రాజశేఖర్

ప్రజాశక్తి - సత్యవేడు: తిరుపతి జిల్లా సత్యవేడు ఇంచార్జ్ తహశీల్దారుగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ తహసిల్దారుగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం డిప్యుటేషన్‌పై జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో వరదయ్యపాలెం తహసిల్దారుగా పని చేస్తున్న రాజశేఖర్‌ను సత్యవేడు ఇంచార్జ్ తాసిల్దార్గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఉత్తర్వులు జారీ చేశారు.


దళితులకు ఇంటి స్థలాలు ఇవ్వండి : సిపిఎం



తహసీల్దారు మునిరత్నం రెడ్డికి కొత్తూరు దళితుల వినతి పత్రం

ప్రజాశక్తి - కే వి బి పురం: ప్రభుత్వాలు మారినా, కెవిబి పురం మండలం, కొత్తూరు దళితులకు ఇంటి స్థలాలు మాత్రం మంజూరు చేయడంలేదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దాసరి జనార్ధన్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కొత్తూరు దళితులతో కలిసి వెళ్లి తాసిల్దార్ మునిరత్నం రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇస్తామని ఆన్లైన్‌లో నమోదు చేసినప్పటికీ ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. ప్రస్తుత టిడిపి ప్రభుత్వం మూడు సెంట్లు గ్రామీణ ప్రాంతాల్లో పట్టాలు ఇవ్వాలని జీవో ఇచ్చినందున, రెవెన్యూ అధికారులు వీరికి పట్టాలు ఇచ్చి, పక్కా ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వినతి పత్రంలో కోరారు. తాసిల్దార్ మునరత్నం రెడ్డి స్పందించి గ్రామ సమీపంలో సర్వేచేసి, స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కెవిబిపురం మండల కార్యదర్శి నాగలపురం నాగరాజు, కొత్తూరు శాఖ కార్యదర్శి వరలక్ష్మి, కొత్తూరు దళిత కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల ఐక్యత సమాజానికి ఎంతో అవసరం : సిపిఐ (ఎంఎల్)



గోడ పత్రికను విడుదల చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : దేశంలో వామపక్ష పార్టీల పునరేకీకరణ ఎంతో అవసరమని, ఈ దేశానికి, సమాజానికి మేలు జరుగుతుందని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ తిరుపతి నగర కార్యదర్శి వెంకట రత్నం పేర్కొన్నారు. ఈనెల 23న విజయవాడ, ఎంబి భవన్ ఆడిటో రియంలో రెండు సిపిఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ పార్టీల విలీన సభ జరగనుంది. ఈ సందర్భంగా కార్యక్రమ గోడ పత్రికలను తిరుపతి నారాయణపురంలోని ఐఎఫ్టియు కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీ యంగా, అంతర్జాతీయంగా కమ్యూనిస్టులు పీడిత ప్రజలకోసం నిస్వార్థంగా పనిచేస్తున్నారన్నారు. మార్క్సిజం- లెనినిజం- మావో ఆలోచన విధానం నూతన ప్రజాస్వామ్యక విప్లవ సాధనలో రెండు సిపిఐ (ఎంఎల్), న్యూ డెమోక్రసీ పార్టీల విలీనం మైలురాయిగా నిలుస్తుందన్నారు. ఈనెల 23వ తేదీన జరిగే కార్యక్రమానికి రాష్ట్ర వ్యాప్తంగా విప్లవ శ్రేణులతో పాటు అభిమానులు, ప్రజాస్వామిక వాదులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్టియు నాయకులు లోకేష్, కుడుం విజయ్ కుమార్, మోహన్, పిడిఎస్‌యు నాయకుడు ధన శేఖర్, ఏపీ ప్రగతిశీల మహిళా సంఘం నాయకురాలు అరుణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.